సాక్షి
ఒడిశా
మంగళవారం । 14 । అక్టోబర్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,53,594లు, బంగారం 1 గ్రాము 550 మిల్లీగ్రాములు, వెండి 14గ్రాముల 600 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

నువాపడా ఉప ఎన్నికకు ఉత్తర్వులు జారీ

భువనేశ్వర్ : నువాపడా ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమైనట్లు పేర్కొంది. అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేసేందుకు ఈ నెల అక్టోబర్ 20 వరకు గడువు కల్పించింది. గడువు ముగియడంతో దాఖలు అయిన నామినేషను దస్తావేజులను మర్నాడు ఈ నెల 21న పరిశీలిస్తారు. అర్హులైన అభ్యర్థుల జాబితా వెల్లడి నుంచి పోటీ నుంచి వైదొలిగేందుకు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి ఈ నెల 23 వరకు గడువు కేటాయించారు. అనంతరం బరిలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. నవంబర్ 11న పోలింగ్ నిర్వహిస్తారు. ఓట్లు లెక్కించి ఫలితాలు నవంబర్ 14న ప్రకటిస్తారు. నువాపడా ఉప ఎన్నికల్లో హెలికాప్టర్లను ఉపయోగించనున్నారు. పోలింగ్ అధికారులు హెలికాప్టర్ ద్వారా 8 బూత్‌లకు వెళతారు. మావోయిస్టుల ప్రభావిత 47 సమస్యాత్మక బూత్‌ల వద్ద గట్టి భద్రత కోసం కేంద్ర సాయుధ దళాలకు చెందిన 14 కంపెనీలను మోహరిస్తారని గోపాలన్ తెలిపారు.

న్యూస్‌రీల్

మిషన్ శక్తి భవనంలో దొంగలు



దొంగలు పడ్డ మిషన్ శక్తి భవనం

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి కేంద్రంలో ఉన్న మిషన్ శక్తి భవనంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. ఆదివారం సెలవు దినం కావడంతో మిషన్ శక్తి భవనానికి తాళం వేశారు. దుండగులు తాళం తీసి లోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న ఫైల్స్ దొంగిలించారు. సోమవారం ఉదయం మిషన్ శక్తి భవనం తీయడం కోసం వస్తే సామాన్లు చిందరవందరగా ఉన్నాయి. దీంతో ధరిత్రీమిషన్ శక్తి అధ్యక్షురాలు పూర్ణిమా దత్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఐఐసి ముకుందో మేల్క తన సిబ్బందితో వచ్చి పరిసరాలు పరిశీలించారు.

రాజధానిలో 47 వేల వీధి కుక్కలు



నగర వీధుల్లో కుక్కల స్వైర విహారం

భువనేశ్వర్: రాష్ట్రంలో తొలిసారిగా రాజధాని నగరంలో వీధి కుక్కల లెక్కింపు చేపట్టారు. స్థానిక నగర పాలక సంస్థ బీఎంసీ ఆధ్వర్యంలో ఈ గణన నిర్వహించారు. ఈ లెక్కల్లో బీఎంసీ పరిధిలో వీధి కుక్కల రేటు జాతీయ రేటు కంటే అధికంగా ఉందని స్పష్టం అయింది. భువనేశ్వర్ నగర పాలక సంస్థ బీఎంసీ ప్రాంతంలో 39,723 వీధి కుక్కలు ఉన్నాయి. నగర జనాభాలో ఈ వీధి కుక్కల సంఖ్య 3.62 శాతంగా నమోదైంది. వాటిలో 23,047 మగ కుక్కలు, 15,552 ఆడ కుక్కలు, 1,124 కుక్కపిల్లలు ఉన్నాయి. 4,068 మగ కుక్కలు, 3,335 ఆడ కుక్కలకు స్టెరిలైజేషన్ జరిగింది.

నగరంలో యువకుడిపై కాల్పులు



సుధాంశు ఖుంటియా

భువనేశ్వర్: అన్న (పెద్ద తండ్రి కొడుకు)ను తమ్ముడు (పినతండ్రి కుమారుడు) తుపాకీతో కాల్చి చంపాడు. నగరంలో ఈ సంఘటన తీవ్ర కలకలం రేపింది. తమ్ముడు 4 రౌండ్లు కాల్పులు జరపడంతో అన్న మృతి చెందాడు. మృతుడిని సుధాంశు ఖుంటియాగా గుర్తించారు. అతని శరీరంలోకి 3 తూటాలు దూసుకు పోయాయి. ఆస్తి వివాదం నేపథ్యంలో హత్య జరిగినట్లు సమాచారం. పోలీస్ కమిషనర్ ఎస్.దేవదత్త సింగ్ సమాచారం ప్రకారం రెండు కుటుంబాల మధ్య వివాదం కారణంగా కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీసు విచారణ కొనసాగిస్తున్నారు. మృతుడు ఎయిమ్స్‌లో ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగా విధులకు హాజరయ్యేందుకు విచ్చేస్తుండగా వెంబడించి తుపాకీ కాల్పులు జరపడం కలకలం రేపింది.

19 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో నిందితుడి అరెస్టు

రాయగడ: గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపిన పోలీసులు ఆ దిశగా విస్తృతంగా దాడులను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని చంద్రపూర్ పోలీసులు సోమవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా కురులిబలి కూడలిలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని పట్టుకుని అతని నుంచి 19 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని కోర్టుకు తరలించారు.

పవిత్ర క్షేత్రం పూరీ

● ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



హబిష్యాలీలకు నమస్కరిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి



హబిష్యాలీల్ని ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగం

భువనేశ్వర్:

పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని రాష్ట్రం మారుమూల ప్రాంతాల నుంచి తరలి వచ్చిన హబిష్యాలీలతో చతుర్ధామ క్షేత్రం పూరీ కళకళలాడుతోంది. కార్తీక మాసంలో నెల రోజులపాటు నిరవధికంగా ప్రత్యేకంగా వ్రతం ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో వితంతు మహిళలు తరలి వచ్చారు. వీరందరి కోసం రాష్ట్ర ప్రభుత్వం పూరీ ప్రాంతంలో ఉచిత వసతి, మహా ప్రసాదం, దర్శనం కోసం ప్రత్యేక రవాణా తదితర ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా పట్టణంలో 5 వేర్వేరు చోట్ల వీరి కోసం ఆరోగ్యం, పటిష్టమైన భద్రత, రక్షణ వ్యవస్థతో ఉచిత వసతి సముదాయాలు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకుని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి హబిష్యాలీలు బస చేసిన బృందావతి సముదాయం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్దాలుగా కార్తీక మాసాన్ని భక్తి మాసంగా పరిగణిస్తారు. ఒడియా మహిళలు ఈ పవిత్ర మాసంలో హవిష్యం పాటించడం తరతరాల సంప్రదాయంగా కొనసాగుతుంది. అత్యంత నియమ నిష్టలతో రాధా దామోదరుల్ని సేవిస్తూ శ్రీ జగన్నాథుని మహా ప్రసాదం (ఒబొఢ)తో నిత్యం ఒంటి పూట భోజనం చేయడం కోసం అనుకూలమైన సదుపాయాల్ని రాష్ట్ర ప్రభుత్వం ఏటా మాదిరిగా ఈ ఏడాది ఏర్పాటు చేసిందన్నారు. హబిష్యాలీలు నియమ నిష్టలతో సుదీర్ఘంగా నెల రోజులపాటు నిర్వహించే కార్తీక వ్రతంతో పరిసరాలు పవిత్రంగా మారుతాయన్నారు. కార్తీక వ్రతం ఒడిశాకు చెందిన ఒక జీవన సంస్కృతి, ఒక ప్రత్యేకమైన సంప్రదాయం అని అన్నారు. ఈ వ్రతం ఆచరించేందుకు చాలా మంది భక్తులు పలు ప్రాంతాల నుంచి ఒంటరిగా వస్తారు. వారు తమ కుటుంబాలను విడిచిపెట్టి ఇక్కడ ఒక నెల రోజులు గడుపుతారు. లోక కల్యాణం కోసం వారు దీపాలను వెలిగిస్తారు. కార్తీక మాసంలో వీరు వెలిగించే దీపాలు రాష్ట్ర నైతిక, ఆధ్యాత్మిక భావాలను మేల్కొల్పుతాయి. పూరీ కేవలం ఒక ప్రదేశం మాత్రమే కాదు. ఈ పవిత్ర క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ జగన్నాథుడు భక్తుల నడుమ ప్రత్యక్షమై అడుగడుగున వేస్తు పుణ్య బాటలో నడపిస్తాడని భక్తులు గట్టిగా విశ్వసిస్తారు. ఈ పవిత్ర స్థలంలో భక్తులకు సేవ చేయడం ప్రభుత్వ విధి. ఈసారి పూరీలోని 5 ప్రదేశాలలో 2 వేల 500 మందికి పైబడి హబిష్యాలీల కోసం వసతి, ఇతర సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యకలాపాల కోసం ప్రభుత్వం రూ. 3.3 కోట్ల వ్యయ ప్రణాళికని రూపొందించినట్లు తెలిపారు. ఇది గత సంవత్సరం కంటే రూ. 70 లక్షలు అధికంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు పూరీ జిల్లా యంత్రాంగం ఔత్సాహికుల కోసం సౌకర్యాలను కల్పిస్తోంది. ఎమ్మెల్యే ఓం ప్రకాష్ మిశ్రా, పూరీ ఎంపీ డాక్టర్ సంబిత్ పాత్రో, జగత్‌సింగ్‌పూర్ ఎంపీ బిభు ప్రసాద్ తొరాయ్, పిప్పిలి ఎమ్మెల్యే అశ్రిత్ పట్నాయక్, పూరీ ఎమ్మెల్యే సునీల్ మహంతి, బ్రహ్మగిరి నియోజక వర్గం ఎమ్మెల్యే ఉపాసన మహాపాత్రొ, జిల్లా కలెక్టర్ దివ్య జ్యోతి పరిడా, పోలీసు సూపరింటెండెంట్ ప్రతీక్ సింగ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ముఖ్యమంత్రిని ఆశీర్వదించిన వ్రత దీక్షకులు



ముఖ్యమంత్రి అందజేసిన కార్తీక వ్రత కానుకతో హబిష్యాలీలు

'ప్రమాదం పొంచి ఉంది'



గజపతి జిల్లా రాయగడ బ్లాక్ పెక్కట గ్రామంలో కొండచరియలు విరిగిపడి సంభవించిన నష్టం



పెక్కట గ్రామంలో కొండచరియలు విరిగిపడిన ఘటన



రాయగడ బ్లాక్ పెక్కట గ్రామంలో ప్రకృతి విలయాన్ని చూస్తున్న రాష్ట్ర రవాణా, ఖనిజ శాఖ మంత్రి బిభూతీ జెన్నా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో అక్టోబరు 2న జరిగిన కొండ చరియలు విరిగిపడిన ఘటనలో రాయగఢ బ్లాక్‌లో పెక్కట గ్రామంలో తండ్రీకొడుకులు ఇద్దరు మృతిచెందారు. అలాగే మోహనా, ఆర్.ఉదయగిరి బ్లాక్‌లలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. ఒడిశాలో ఇక్కడే ప్రత్యేకంగా కొండ చరియలు విరిగిపడుతున్నాయి. ఇలాం ప్రకృతి వైపరీత్యాలు మళ్లీ జరగకుండా జిల్లా యంత్రాంగం ఒక జియోలాజికల్ సర్వే చేపట్టాలని పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కోరుతున్నారు. ఆల్ ఇండియా ల్యాండ్ స్లైడ్ ససెప్టబిలిటీ మ్యాప్ (ఐ.ఎల్.యస్.యం), ఐఐటీ, ఢిల్లీ విద్యార్థులు జరిపిన సర్వేలో గజపతి జిల్లాలో 129 కొండచరియలు విరిగిపడే లోకేషన్లు ఉన్నట్లు గుర్తించారు. మోహనా, నువాగడ, ఆర్. ఉదయగిరి, రాయగడ సమితి కేంద్రాల్లో గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నారు. ఏటవాలు ప్రాంతంలో పోడు వ్యవసాయం ఎక్కువగా చేస్తూ మొక్కజొన్న, వరి, రాగులు, కాయగూరల పంటలు పండిస్తూ జీవిస్తున్నారు. అయితే పర్యావరణ శాస్త్రవేత్తలు గజపతి జిల్లాలో సుమారు కొండ చరియలు విరిగిపడే 129 అపాయకర ప్రాంతాలను గుర్తించారు. అక్కడ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి కోరుతున్నారు. అక్టోబర్‌లోనే గజపతి ఎక్కువగా వానలు కురుస్తుంటాయి. ప్రకృతి వైపరీత్యాలు సైతం ఇదే మాసంలో సంభవిస్తుంటాయి. అక్టోబరు 15 నుంచి వాయవ్య బంగాళాఖాతంలో తిరిగి అల్పపీడనం సంభవించనున్న దృష్ట్యా ఒడిశాలో పలు జిల్లాలో అతలాకుతలం అయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఇంజినీరింగ్ చదివి.. గంజాయి స్మగ్లర్‌గా మారి



కొరాపుట్ రైల్వే పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్ దొయితరి ఖెముండు

కొరాపుట్: ఇంజినీరింగ్ చదివి గంజాయి స్మగ్లర్‌గా మారిన యువకుడి ఉదంతం ఇది. సోమవారం కొరాపుట్ రైల్వే పోలీసులు గత కొంత కాలంగా గాలిస్తున్న గంజాయి స్మగ్లర్ దొయితరి ఖెముండుని అరెస్ట్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రైలులో అక్రమ గంజాయి రవాణా చేస్తున్న బీహార్‌కు చెందిన అరవింద కుమార్‌ని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. అరవింద తమకు గంజాయిని దొయితరి ఖెముండు సరఫరా చేస్తాడని వాంగ్మూలం ఇచ్చాడు. దాంతో అతని కోసం అనేక చోట్ల గాలించి చివరకు అరెస్ట్ చేశారు. దొయితరి నోరు తెరిచి వివరాలు ప్రకటించినప్పుడు రైల్వే పోలీసులు ఆశ్చర్యపోయారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన తను ఉపాధి లేక గంజాయి స్మగ్లర్‌గా మారనని ప్రకటించాడు. తాను జైలులో ఉన్న గంజాయి స్మగ్లర్ల జాబితా తీసుకొని వారికే గంజాయి సరఫరా చేశానని పేర్కొన్నారు. అంతేకాక రైల్వే స్టేషన్ సమీపంలోనే సీసీ కెమెరా లేని చోట ఇంటిలో గంజాయి ఉంచి సరఫరా చేసే వాడినని చెప్పడంతో రైల్వే పోలీసులు అవాక్కయ్యారు. తమ సమీపంలోనే గంజాయి నిల్వ ఉంచడంతో పోలీసులకు అనుమానం రాలేదు. దాంతో గత కొంత కాలంగా తాను రైల్వే స్టేషన్ సమీపంలోనే గంజాయి నిల్వ ఉంచానని పేర్కొన్నాడు. అంతేకాక జైలులో గంజాయి స్మగ్లర్ల సమాచారం తీసుకొని వారి చేతే గంజాయి రవాణా చేయించానని పేర్కొన్నారు. పోలీసులు కేసులు నమోదు చేసి జైలుకి తరలించారు.

సాదా సీదాగా ముఖ్యమంత్రి



పూరీ జిల్లా సత్యబాది ప్రాంతం కొబ్బరి బొండాం కొట్టులో ప్రత్యక్షమైన ముఖ్యమంత్రి

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పూరీ వెళ్తుండగా దారిలో సత్యబాది వద్ద ఆగి సాదాసీదా పౌరుని తరహాలో రహదారి పక్క ఉన్న కొబ్బరి బొండాం తాగారు. ఈ సందర్భంగా ఆయన దుకాణంలో ఉన్న సాధారణ ప్రజానీకంతో మాటామంతి చేసి మురిపించారు. మరో మారు ఆయన ప్రజల ముఖ్యమంత్రిగా చాటుకున్నారు. ఇటీవల రాజధాని నగరం వీధుల్లో తేనీటి కొట్టు దగ్గర ఆగి టీ తాగుతూ ప్రజా సమస్యలపై సంభాషించారు.

రౌర్కెలా హై టెక్ ఆస్పత్రిలో జన ఔషధి ప్రారంభం



రౌర్కెలా హై టెక్ ఆస్పత్రిలో జన ఔషధి ప్రారంభించిన కేంద్ర మంత్రి జుయెల్ ఓరాం



రౌర్కెలా హై టెక్ ఆస్పత్రిలో జన ఔషధి ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథి ప్రముఖులు

భువనేశ్వర్: రౌర్కెలా హైటెక్ వైద్య కళాశాల, ఆస్పత్రి ఆవరణలో ప్రధాన మంత్రి జన ఔషధి విక్రయ కేంద్రం ప్రారంభించారు. కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జుయెల్ ఓరాం చేతుల మీదుగా దీన్ని ప్రారంభించారు. రౌర్కెలా ఎమ్మెల్యే శారదా ప్రసాద్ నాయక్, రఘునాథ్‌పల్లి ఎమ్మెల్యే దుర్గా చరణ్ తంతి ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అన్ని వర్గాల రోగులకు సులభంగా, సరసమైన ధరలకు ఈ కేంద్రంలో మందులు లభిస్తాయి. రౌర్కెలా ఆస్పత్రిలో సకాలంలో సముచిత వైద్యం లభించడంతో సరసమైన ధరలకు జన ఔషధి విక్రయ కేంద్రంలో నాణ్యమైన మందులు దొరుకుతాయన్నారు. హైటెక్ వైద్య కళాశాల ఆస్పత్రి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తిరుపతి పాణిగ్రాహి హాజరై ఆస్పత్రిలో చికిత్స పొందే రోగులు కొత్తగా ప్రారంభించిన జన ఔషధి కేంద్రం సేవల్ని సద్వినియోగపరచుకోవాలని తెలిపారు.

గురండి గ్రీవెన్స్‌కు 108 వినతులు



పర్లాకిమిడి: వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మధుమిత



వసుంధర భూపట్టాలను అందజేస్తున్న కలెక్టర్ మధుమిత తదితరులు

పర్లాకిమిడి: గుసాని సమితి గురండి పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సు సెల్‌కు విశేష స్పందన లభించింది. జిల్లా కలెక్టర్ మధుమిత అధ్యక్షత వహించగా, అదనపు ఎస్పీ సునీల్ కాంత మహాంతి, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శంకర్ కెరకెటా తదితరులు హాజరయ్యారు. గురండి పంచాయతీతో పాటు తాటిపట్టి, పెద్ద గుసాని, బుసుకుడి గ్రామ పంచాయతీల నుంచి 108 వినతులు అందాయి. వాటిలో వ్యక్తిగతం 64 కాగా, గ్రామ సమస్యలు, అభియోగాలు 44 వచ్చాయి. వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం 12 మందికి వసుంధర భూపట్టాలను కలెక్టర్ గురండిలో అందజేశారు. గురండి పంచాయతీ కార్యాలయం ఆవరణలోని అంగన్‌వాడీల రాష్ట్రీయ పోషణ స్టాల్‌ను కలెక్టర్ సందర్శించారు. గుసాని బీడీవో గౌర చంద్ర పట్నాయక్, తహసీల్దార్ నారాయణ బెహరా, సీడీఎంవో డాక్టర్ ఎం.ఎం.ఆలీ పాల్గొన్నారు.

అంబులెన్స్‌కు అనారోగ్యం!

● ఘాట్ రోడ్డులో రోగితో నిలిచిపోయిన అంబులెన్స్



నిలిచిపోయిన 108 అంబులెన్స్

కొరాపుట్: అత్యవసరంగా వెళ్లాల్సిన అంబులెన్స్‌కి అనారోగ్యం చేసింది. కొరాపుట్ జిల్లా బొయిపరిగుడ నుంచి రోగితో అత్యవసరంగా ప్రభుత్వ 108 అంబులెన్స్ సోమవారం బయలు దేరింది. జాతీయ రహదారి-26పై కొరాపుట్ ఘాట్‌పైకి వెళ్తుండగా అకస్మాత్తుగా నిలిచి పోయింది. దీంతో రోగి బంధువులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే అంబులెన్స్ డ్రైవర్ సహచర సిబ్బందిని సంప్రదించి మరో అంబులెన్స్‌ని రప్పించి అందులో రోగిని కొరాపుట్ తరలించారు. ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలకి రోగి సకాలంలో చేరడంతో ప్రమాదం తప్పింది. కానీ మరమ్మతులకు గురైన అంబులెన్స్‌కి సుమారు 15 కాల్స్ వచ్చినా ఘాట్ రోడ్డు లోనే ఉండి పోయింది. పట్టించు కోనే వారు లేక అంబులెన్స్ డ్రైవర్ ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ 108 అంబులెన్స్ వాహనాల పనితీరుపై విమర్శలు రేగుతున్న వేళ ఈ ఘటన చోటు చేసుకుంది.

'గదబ సంప్రదాయాన్ని కాపాడుకోవాలి'



సంప్రదాయ నృత్య నాట్యాలతో అతిథులకు స్వాగతం పలుకుతున్న గదబ నృత్యకారులు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రామ చంద్ర కడమ్



సభికులకు అభివాదం చేస్తున్న చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖిలో

జయపురం:

కొరాపుట్ జిల్లాలో గదబ సంప్రదాయ గిరిజనుల భాష, సంస్కృతి సంప్రదాయం పరిరక్షణకు సామూహిక ఉద్యమం అవసరమని రాష్ట్ర విధాన సభలో కాంగ్రెస్ నేత, పొట్టంగి ఎమ్మెల్యే రామచంద్ర కడమ్ అన్నారు. సోమవారం జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలో గదబ సమాజ్ వికాశ పరిషత్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వికాస పరిషత్ అధ్యక్షుడు మోహన్ శ్రీకరలియ అధ్యక్షతన నిర్వహించిన వార్షిక సమావేశంలో రామచంద్ర కడమ్ ప్రసంగిస్తూ కొరాపుట్ జిల్లాలో గదబ సంప్రదాయ గిరిజనులు పురాతన తెగ అని, వారి నృత్య సంగీతాలకు సమాజంలో ప్రత్యేక ఆదరణ ఉందని అయితే వారికి ప్రభుత్వం తగిన సహకారం అందించక పోవటం వల్ల కళలు కనుమరుగు అవుతున్నాయని వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. వార్షికోత్సవం సందర్భంగా బొయిపరిగుడలోగల సహిద్‌లక్ష్మణ నాయిక్ పాఠాఘర్ ప్రాంగణంలో నిర్వహించిన వార్షికోత్సవంలో మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ ఎమ్మెల్యే మంగు ఖిలో, గదబ సమాజ్ వికాస పరిషత్ సీనియర్ నేత ముకుంద హంతాల్, భగీరథ్ ముర్దయ, జితేంద్ర నాయిక్ తదితరులు అతిథులుగా హాజరయ్యారు.

క్లుప్తంగా

26 వినతుల స్వీకరణ



వినతిపత్రాన్ని స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల ఎన్‌ఏసీ కార్యాలయంలో సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. బలిమెల కోరుకొండ పరిసర ప్రాంతాలకు చెందిన గిరిజనులు వినతిపత్రాలు అందించారు. 26 వినతులను అధికారులు స్వీకరించారు. ఎస్పీ వినోద్ పటేల్, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ సభరో, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పౌర విమానయాన మంత్రిని కలిసిన ఎంపీ



కేంద్ర మంత్రితో చర్చిస్తున్న ఎంపీ అపరాజిత షడంగి

భువనేశ్వర్: పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును స్థానిక పార్లమెంటు సభ్యురాలు అపరాజిత షడంగి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వీరివురి మధ్య కొనసాగిన సంభాషణలో భువనేశ్వర్ బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 3వ టెర్మినల్ నిర్మాణం ఆమోదం కోసం ఆయనను అభ్యర్థించారు. భువనేశ్వర్ నుంచి పలు ప్రముఖ ప్రాంతాలకు రాకపోకల కోసం విమానాల అవసరం గురించి ఎంపీ ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో వీరిరువురి మధ్య సానుకూల చర్చ సాగినట్లు ఎంపీ తెలిపారు. ఈ దిశలో తదుపరి చర్యలు పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందన్నారు.

కేపీఎల్ క్రికెట్ లీగ్ ప్రారంభం



క్రీడాకరులను ఉద్దేశించి మాట్లాడుతున్న కొండబాబు

రాయగడ: క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ నాయకుడు యాల్ల కొండబాబు ఆకాంక్షించారు. జిల్లాలోని కొలనారలో సోమవారం కొలనార ప్రీమియర్ లీగ్ (కేపీఎల్) క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ క్రీడాకారులకు ఇటువంటి తరహా పోటీలు వారి ప్రతిభను కనబరుచుకునే అవకాశాన్ని కల్పిస్తుంటాయన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ టోర్నమెంటులో నాలుగు జట్లు పాల్గొన్నాయి. ప్రతీ జట్టు నాలుగు సార్లు పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. బీజేపీ నాయకులు చక్రధర్ బిడిక, బిరజా పాత్రో, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పూర్ణాహుతి కార్యక్రమం

రాయగడ: స్థానిక బాలాజీనగర్‌లోని కళ్యాణ వేంకటేశ్వర ఆలయంలో మూడు రోజులుగా జరుగుతు న్న పవిత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం సుప్రభా త సేవ, శాత్తుమురై, తీర్థ గోష్ఠి, సాయంత్రం పూర్ణాహుతి, తిరువీధి, పవిత్ర విసర్జన కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యు లు ఆధ్వర్యంలో మూడు రోజుల పవిత్రోత్సవాలు ఘనంగా జరిగాయి.

వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద ఒక వివాహిత అదృశ్యమైనట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు సోమవారం వెల్లడించారు. గార మండలం కళింగపట్నానికి చెందిన సంతోషి(21)కి విజయవాడకు చెందిన భక్తుల వెంకటేశ్వరరావుతో నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహమైంది. తరచూ ఫోన్‌లో గడపడంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆరు నెలల క్రితం కళింగపట్నంలోని పుట్టింటికి వచ్చేసింది. ఈ క్రమంలో ఈనెల 8వ తేదీన విజయనగరంలో పండగకు కుమార్తె బయల్దేరడంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్సులో బస్సు ఎక్కించానని తల్లి వనుము సూరమ్మ తెలిపారు.

పాఠశాలకు తాళాలు

జయపురం:

జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి కెరమెటి గ్రామ పంచాయతీ కొంతపాదర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు గాయత్రీ ధరువని మరో గ్రామంలో పాఠశాలకు బదిలీ చేయటాన్ని ఆ గ్రామ వాసులు తీవ్రంగా వ్యతిరేకించారు. వెంటనే ఆమె బదిలీ ఆర్డర్‌ను రద్దు చేసి ఆమెను వెనక్కు తీసుకురావాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల అభ్యర్థనను అధికారులు పట్టించుకొక పోవడంతో సోమవారం పాఠశాలకు గ్రామస్తులు, పాఠశాల పరిచాలన కమిటీ సభ్యులు కలిసి తాళాలు వేశారు. 6 నెలల కిందట ఉపాధ్యాయురాలు గాయత్రి ధురువను బదిలీ చేశారని వెంటనే ఆమె బదిలీని రద్దు చేయాలని తాము బ్లాక్ విద్యాధికారికి రెండు పర్యాయాలు విజ్ఞప్తి చేశామని వెల్లడించారు. అలాగే కొరాపుట్ జిల్లా కలెక్టర్‌కు రాసిన వినతిని కుంద్ర సమితి బ్లాక్ అదనపు విద్యాధికారి పాపెయి బెహరకు అందజేశామని వెల్లడించారు. గత మే 3వ తేదీన, జూన్ 6వ తేదీన బ్లాక్ విద్యాధికారికి ఉపాధ్యాయురాలు ధరువ మదిలీ రద్దు చేయాలని వినతులు అందజేశామన్నారు. రెండు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని బీఈఓ హామీ ఇచ్చారని, ఆమె బదిలీ అయ్యి 6 నెలలు గడచినా నేటివరకు ఎటువంటి చర్య తీసుకోలేదని ఆరోపించారు. మరో మార్గం లేక పాఠశాలకు తాళాలు వేశామని వెల్లడించారు. ఈ సంఘటనతో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గుప్త చంద్ర భుయ్, బీఈఓకు తెలియజేశారు. తరువాత ఏబీఈఓ పాపెయి బెహరా, సీఆర్‌సీసీ సంజయ సామంతరాయ్, సమితి ఉపాధ్యాయ సంఘ అధ్యక్షులు త్రినాథ్ పండా, ఉపాధ్యక్షుడు రాకేష్ చంద్రగురు, పాఠశాలకు వచ్చి పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు లభి సొంత, గ్రామస్తులతో చర్చలు జరిపారు. వారం రోజుల్లో ఉపాధ్యాయురాలుని తిరిగి పాఠశాలకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గ్రామస్తులు ససేమిరా అంటూ పాఠశాల తాళాలు తీసేది లేదంటూ భీష్మించారు. అనంతరం బీఈఓ రఘునాథ్ పంగితో ఫోన్ ద్వారా మాట్లాడించగా ఆయన ఇచ్చిన హామీతో పాఠశాల తాళాలు తీశారు. వారం రోజుల్లో ఉపాధ్యాయురాలు పాఠశాలకు రాకపోతే మరలా తాళాలు పాఠశాలకు వేస్తామని, ఉపాధ్యాయురాలు పాఠశాలకు వచ్చేంత వరకు తాళాలు తీసేది లేదని హెచ్చరించారు.



పాఠశాలకు తాళాలు వేసిన గ్రామస్తులతో విద్యార్థులు



గ్రామస్తులతో చర్చలు జరుపుతున్న అధికారులు

ఈపీఎఫ్ పెన్షనర్ల డిమాండ్లు నేరవేర్చాలి



మాట్లాడుతున్న ప్రమోద్ కుమార్ మహంతి

జయపురం: ఈపీఎఫ్ పింఛన్‌దారుల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఆందోళనలు చేస్తామని కార్మిక నేత, సేవా పేపరు మిల్లు కార్మిక సంఘ అధ్యక్షులు ప్రమోద్ కుమార్ మహంతి అన్నారు. సోమవారం స్థానిక యాదవ భవనంలో కొరాపుట్ జిల్లా ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు నళినీకాంత రథో అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఈపీఎఫ్ పెన్షన్‌దారులకు నెలకు కనీసం తొమ్మిది వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని, ఉచిత వైద్య సేవలు సమకూర్చాలని, డీఏ పెంచాలని ఎన్నో ఆందోళనలు జరుపుతున్నప్పటికీ ప్రయోజనం లేదన్నారు. నవంబర్ 16వ తేదీన దేశ వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లలకు వినతి పత్రాలు సమర్పించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఆర్గనైజర్ దుర్గప్రసాద్ దాస్, సభ్యులు పి.గౌరీశంకరరావు, బసంతరావు, జి.ప్రసాదరావు, కిశోర్ చంద్రపండా, సువర్ణ బిశాయి, భాస్కర మిశ్ర పాల్గొన్నారు.

ఎస్‌ఐ నియామక కుంభకోణంపై లుక్ అవుట్ జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో తీవ్ర సంచలనం రేపిన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) నియామక రాత పరీక్ష కుంభకోణంపై దర్యాప్తు అంచెలంచెలుగా కఠినతరం అవుతోంది. ప్రధాన సూత్రధారుల కోసం దర్యాప్తు బాధ్యతలు చేపట్టిన క్రైమ్ శాఖ గాలింపు ముమ్మరం చేసింది. వారి ఆచూకీ కోసం నగదు పురస్కారం ప్రకటించిన విషయం తెలిసిందే. తదుపరి చర్యలో భాగంగా సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) నియామక కుంభకోణంపై దర్యాప్తును మరింతం ముమ్మరం చేసింది. పరారీలో ఉన్న నిందితుల జాడ కోసం లుక్ అవుట్ సర్క్యులర్ జారీ చేసింది. ఈ కుంభకోణంలో భారీ స్థాయిలో నగదు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణల కింద ఈ కేసుతో ముడిపడి ఉన్న బహుళ బ్యాంకు ఖాతాలను దర్యాప్తు వర్గం క్రైం శాఖ స్తంభింపజేసింది. దర్యాప్తులో భాగంగా కీలక అనుమానితులు శంకర్ ప్రుష్టి, మున్నా మహంతి సహా 10 మంది బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసినట్లు ఈ వర్గాలు పేర్కొన్నాయి. కీలకమైన ఆధారాలను సేకరించేందుకు క్రైమ్ శాఖ దళారుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను ఫోరెన్సిక్ పరీక్ష కోసం పంపింది. మరో వైపు పరారీలో ఉన్న నిందితుల కోసం క్రైమ్ శాఖకు చెందిన నాలుగు ప్రత్యేక బృందాలు జార్ఖండ్, బీహార్‌లలో ఏకకాలంలో దాడులు నిర్వహిస్తున్నాయి. స్వాధీనం చేసుకున్న పరికరాల ఫోరెన్సిక్ విశ్లేషణ, చాట్ బ్యాకప్‌ల రికవరీ ద్వారా నియామక కుంభకోణం ముఠా విస్తృత నెట్‌వర్క్ గురించి కీలకమైన ఆధారాలు లభిస్తాయని అధికారులు భావిస్తున్నారు. ఈ కుంభకోణంలో ప్రాథమిక దశలో పలువురు అభ్యర్థులు, దళారుల్ని క్రైం శాఖ అరెస్టు చేసింది. వీరి విచారణలో లభ్యమైన కీలక ఆధారాలతో ఈ అక్రమాల్లో ప్రమేయం ఉన్నట్లు తేలిన నిందితుల్ని గుర్తించి పట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు.

కళ్యాణసింగుపూర్‌లో వినతుల స్వీకరణ



వినతులు వింటున్న కలెక్టర్ కులకర్ణి, పక్కనే ఎస్పీ స్వాతి తదితరులు

రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సమావేశం హాల్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అశుతోస్ కులకర్ణి ఆధ్వర్యంలో వినతుల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఎస్పీ స్వాతి ఎస్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి లక్షయ కుమార్ కెముండో, సబ్ కలెక్టర్ రమేష్ కుమార్ జెన్న, ఐటీడీఏ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ చంద్రకాంత్ మాఝి, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ సరోజిని దేవి తదితరులు హాజరయ్యారు. సమితి పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 75 వినతులు కలెక్టర్ దృష్టికి వచ్చాయి. ఇందులో 63 వ్యక్తిగత సమస్యలు కాగా ఎనిమిది గ్రామ సమస్యలుగా గుర్తించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కులకర్ణి నలుగురికి వైద్య ఖర్చుల నిమిత్త ం రెడ్ క్రాస్ నిధుల నుంచి 60 వేల రుపాయలను మంజూరు చేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నైవేద్యాల నివేదన

శ్రీకాకుళం నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న నందెన్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం 25 నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకులు అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో నందెన్నకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

- శ్రీకాకుళం కల్చరల్



లారీని ఢీకొన్న టాటా మ్యాజిక్

నందిగాం: మండల పరిధిలోని నర్సిపురం సమీపంలో జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని టాటా మ్యాజిక్ వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్‌లో ఉన్న తొమ్మిది మంది గాయాలపాలయ్యారు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన పిట్ట చంద్రశేఖర్‌తో పాటు మరో 8 మంది టాటా మ్యాజిక్ వ్యాన్‌లో ఆదివారం ఉదయం ఒడిశా రాష్ట్రంలోని రాయగడలో మజ్జిగౌరి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరిగి గ్రామానికి వస్తుండగా ఆదివారం రాత్రి మండల పరిధిలోని నర్సిపురం సమీపంలో ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీ కొట్టారు. దీంతో వ్యాన్‌లో ఉన్న 9 మందికి చిన్న, చిన్న గాయాలయ్యాయి. ప్రమాదం విషయం తెలుసుకున్న నేషనల్ హైవే అంబులెన్స్ సిబ్బంది అక్కడకు చేరుకొని క్షతగాత్రులను టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ షేక్ మహ్మద్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

బాలిక కిడ్నాప్ కేసులో వ్యక్తి అరెస్టు

జయపురం: బాలికను అపహరించిన సంఘటనలో నిందితుడైన కుమారుడికి సహకరించాడన్న ఆరోపణపై తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని కోర్టులో హాజరుపరచినట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి సోమవారం వెల్లడించారు. అరెస్టు అయిన నిందితుడి తండ్రిది బొరిగుమ్మ సమితి తుటిగుడ గ్రామం త్రిలోచన హరిజన్(48) అని వెల్లడించారు. పోలీసు వివరణ ప్రకారం జయపురం సదర్ పోలీసు స్టేషన్ పరిధిలో కుమిలిపుట్ గ్రామంలో 16 ఏళ్ల బాలికను గత నెల మధ్యలో రెండు సార్లు కిడ్నాప్ చేసిన ఘటనపై జయపురం సమితి హొరడపుట్ యువకుడు సమీర్ హరిజన్‌పై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఘటనలో నిందితుడైన యువకునికి అతడి తండ్రి సహకరించాడన్న ఆధారం వెల్లడి కావటంతో పోలీసులు త్రిలోచన హరిజన్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 4న బాలిక స్కూలుకు వెళ్తుండగా బలవంతంగా కారులో తీసుకెళ్లిపోయారు. పోలీసులు గాలించగా నవరంగపూర్ జిల్లా ఖతిగుడ పోలీసు స్టేషన్ ప్రాంతంలో కనుగొని తీసుకువచ్చారు. నిందితుడు పరారైపోయాడు. మరోమారు ఈ నెల 5న బాలికను అపహరించాడు. ఈ సంఘటనపై బాలిక తండ్రి జయపురం సదర్ పోలీసు స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేసాడు. సమీర్ బాలికను అపహరించేందుకు అతడి తండ్రి సహకరించాడని ఆరోపణపై అరెస్టు చేసినట్లు పట్టణ పోలీసులు వెల్లడించారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

పొందూరు: మండలంలోని పుల్లాజీపేట గ్రామంలో సోమవారం విద్యుత్ షాక్‌తో జాడ ఉమామహేశ్వర రావు(38) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని జాడపేట గ్రామానికి చెందిన ఉమామహేశ్వరరావు 13 ఏళ్ల క్రితం పుల్లాజీపేటకు చెందిన నాగమణిని వివాహం చేసుకుని, పుల్లాజీపేటలోనే ఎలక్ట్రీషియన్‌గా స్థిరపడ్డాడు. సోమవారం గ్రామంలో పి.సుబ్బారావు ఇంట్లో గ్రీజర్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

దేవాలయాల్లో హుండీలు చోరీ

బూర్జ: మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేట గ్రామం, కేకేరాజపురం గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆయా గ్రామస్తులు తెలియజేశారు. లచ్చయ్యపేట గ్రామంలోని నీలమణి దుర్గ అమ్మవారి దేవాలయంలో ఉన్నటువంటి రెండు హుండీలు గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లినట్లు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సూరపు ఉదయ్‌కుమార్ తెలిపారు. అలాగే కేకే రాజపురం గ్రామంలో ఉన్న శివాలయంలో హుండీ పగలు గొట్టి, డబ్బులు, వెండి చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

నివేదికలు ఇవ్వరు.. చర్యలు తీసుకోరు..?

- ఎచ్చెర్ల సీడీపీవోపై కాంట్రాక్టర్ ఫిర్యాదు
- లంచం అడిగారని ఆరోపణ
- జేసీకి నివేదికలు ఇవ్వని ఐసీడీఎస్ పీడీ
- చర్యలు తీసుకోని ఉన్నతాధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎచ్చెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ సెంటర్లకు బాలామృతం ప్యాకెట్లు సరఫరా చేసే రవాణా కాంట్రాక్టును పైడి వెంకటరమణ చేస్తున్నాడు. ఈ అగ్రిమెంట్ 2026 మార్చి వరకు ఉంది. ప్రాజెక్టు పరిధిలో 116 అంగన్‌వాడీ సెంటర్లకు ఈయనే కాంట్రాక్టర్. ప్రభుత్వం రవాణా చార్జీ కింద ఒక్కో ప్యాకెట్‌కు రూ.5లు చొప్పున చెల్లిస్తోంది. ఇటీవల 14 నెలల బిల్లులు సుమారు రూ.1,75,000లు విడుదలయ్యాయి. వీటిలో ప్యాకెట్‌కు రూ.0.75 పైసలు వంతున.. అంటే సుమారు రూ.40 వేలు లంచంగా ఇవ్వాలని సీడీపీవో డోల పాపినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసరావులు డిమాండ్ చేశారు. దీంతో వీరిరువురిపై పూర్తి ఆధారాలతో ఈనెల 22న కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో కాంట్రాక్టర్ పైడి వెంకటరమణ ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు చేసి 15 రోజులైనా...

మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఎచ్చెర్ల చైల్డ్ డవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి (సీడీపీవో) డోల పాపినాయుడుపై ఫిర్యాదు వచ్చి 15 రోజులు పూర్తయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. సీడీపీవో అవినీతిపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తన చాంబర్‌లో నేరుగా దర్యాప్తు చేసి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పూర్తి నివేదిక వెంటనే అందజేయాలని, అనంతరం ఆయనపై సస్పెన్షన్ వేటు ఉంటుందని ఆ సమావేశంలోనే ఐసీడీఎస్ పీడీకి స్పష్టం చేశారు. అయినా ఇప్పటివరకు ఐసీడీఎస్ పీడీ నివేదికలు జేసీ కార్యాలయానికి ఇంతవరకు అందజేయలేదు. ఒకసారి షోకాజ్ నోటీసుకి సమాధానం తెలిపినా.. దానిపై జేసీ సంతృప్తి చెందలేదు. స్పష్టమైన నివేదిక అందజేయాలని ఆదేశించారు.

మరలా ఫిర్యాదు

15 రోజుల ముందు చేసిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో వెంకటరమణ మరలా గత వారం పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై మరలా పీడీ కార్యాలయం నుంచి విచారణకు జేసీ పిలిపించారు. అయితే పీడీ కార్యాలయం వారు జేసీ లేని సమయంలో వెళ్లి, ఆయన లేరని దాటవేస్తున్నారు. వారంలో రోజులుగా జేసీని వారు కలవలేదు. జేసీ ఆదేశాల మేరకు అక్కడ పనిచేస్తున్న సీడీపీవో పాపినాయుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నా ఐసీడీఎస్ పీడీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆయన వీరిద్దరినీ కాపాడుతున్నారని తెలుస్తోంది. వెంకటరమణ చేసిన ఫిర్యాదుపై చర్యలు లేకుండానే ఇటీవల ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఆ సమస్య పరిష్కారమైనట్లు ఎండార్స్‌మెంట్ ఇచ్చి చేతులు దులుపుకోవడం గమనార్హం.


ENDORSEMENT

PUBLIC GRIEVANCE REDRESSAL SYSTEM

ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఇచ్చిన ఎండార్స్‌మెంట్

ఫిర్యాదుపై ఒత్తిళ్లు

సీడీపీవో పాపినాయుడు, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీనివాసరావుపై ఫిర్యాదు చేసిన వెంకటరమణకు నేరుగా పీడీ కార్యాలయం నుంచి ఫోన్‌కాల్స్ వెళ్తున్నాయి. తన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని, అందుకు నగదు, ఇంకేమైనా వేరే కాంట్రాక్టులు ఇప్పిస్తామని ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదుదారుడు చెబుతున్నాడు. కాగా తనకు అన్యాయం జరిగిందని, ఇప్పటికే రెండు నెలలుగా సరుకులు పంచేందుకు అధికారులు సహకరించడం లేదని, తనకు న్యాయం జరగకపోతే మరోసారి జేసీ దృష్టికి తీసుకెళ్తానని ఆయన పేర్కొంటున్నారు.

బైకు చోరీ కేసులో..నిందితులకు మూడేళ్లు జైలు

రాయగడ: బైకు చోరీ కేసుకు సంబంధించి విచారించిన ఎస్‌డీజేఎం వర్షాదాస్ నలుగురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షను విధిస్తూ తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు అదనంగా మరో రూ.10 వేల చొప్పున నిందితులు జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా మరో ఆరు నెలలపాటు జైలు శిక్షను అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. 2024 డిసెంబర్ 18వ తేదీన కొత్తాగుడ గ్రామానికి చెందిన ఉర్లాక బిశు ఇంటి ముందు ఉంచిన బైకు దొంగ తనానికి గురైంది. దీనిపై బాధితుడు చందిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు ఈ మేరకు అరుజు పిడిక, సహదేవ్ మండంగి, బిజయ్ కుమార్ మండంగి, హరేస్ ఖమారి అనే నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ కేసు విచారణలో భాగంగా వర్షాదాస్ సోమవారం పది మంది సాక్షులను విచారించి తుది తీర్పును వెల్లడించారు.

ఉపాధ్యాయునిపై దాడి



భువనేశ్వర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సాహు

రాయగడ: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, బిలేసు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న ద్వితిచంద్ర సాహుపై గుర్తుతెలియని దుండగుడు దాడి చేశాడు. ఈ దాడిలో సాహు తలకు తీవ్రగాయాలయ్యాయి. రాజధాని భువనేశ్వర్‌లోని రైల్వే పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సదరు సమితి బిలేసు ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న సాహు విధుల్లో భాగంగా భువనేశ్వర్ వెళ్లాడు. ఈ క్రమంలో భువనేశ్వర్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం 6 వద్ద రైలు దిగి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గుర్తుతెలియని దుండగుడు మొబైల్ లాక్కోవడమే కాకుండా కర్రతో దాడి చేశాడు. ఈ దాడిలో సాహు తలపై తీవ్రగాయాలయ్యాయి. అక్కడి వారు కొందరు అతనిని కేపిటల్ హాస్పిటల్‌కు తరలించారు. దాడి చేసిన దుండగులు ఎవరు, ఎందుకు దాడి చేశాడు, మొబైల్ లాక్కొని పారిపోకుండా ఎందుకు కర్రతో దాడి చేశాడనే విషయం రాయగడలో చర్చనీయంశంగా మారింది. బాధితుడు సాహు భువనేశ్వర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ సమస్యలపై గిరిజనుల ఆందోళన



పొట్టంగిలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

- 15 రోజుల్లో పరిష్కారానికి అధికారుల హామీ

కొరాపుట్: విద్యుత్ సమస్యలపై గిరిజనులు ఆందోళనకు దిగారు. కొరాపుట్ జిల్లా పొట్టంగి సమితి కేంద్రంలో సోమవారం ఆందోళన చేపట్టి సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. సమితి పరిధిలోని సుంకి, పెట్టురు, అంపావల్లి, గొల్లురు, పొట్టంగి పరిసర గ్రామాల ప్రజలు విద్యుత్ సమస్య ఎదుర్కొంటున్నారు. లోఓల్టేజీ సమస్య, విద్యుత్ కోత, నాణ్యమైన విద్యుత్ సరఫరా కాకపోవడం, వినియోగంతో సంబంధం లేకుండా బిల్లులు అధికంగా వస్తున్నాయంటూ ఆందోళన చేపట్టారు. పెట్టురు వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని విద్యుత్‌శాఖ కార్యాలయం సిబ్బందికి అందజేశారు. ఈ సమస్యలపై 15 రోజుల్లో పరిష్కార చర్యలు ఉంటాయని విద్యుత్ అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు వెనుతిరిగారు.

దొంగతనం కేసులో ఇద్దరు అరెస్టు



నిందితులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా పోడియ సమితిలో దొంగతనం కేసులో ఉన్న ఇద్దరు నిందితులను పోడియా ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ సోమవారం అరెస్టు చేశారు. గత ఏడాది కలిమెల సమితి ఉండ్రుకొండ పంచాయతీ అడవి మార్గంలో ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్న ఇద్దరు వ్యక్తుల నుంచి కత్తులు చూపి కలెక్షన్ చేసిన నాలుగు లక్షల రూపాయల నగదును దొంగలించారు. కేసు నమోద్ చేసి దర్యాప్తులో ఉంది. ఆదివారం రాత్రి నిందితులు రవి దళపతి, రవీంద్ర దళపతిగా గుర్తించారు. ఈ ఇద్దరు బలిమెల ప్రాంతానికి చెందిన వారు అని తెలుసుకున్న పోడియా పోలీసులు వారిని అరెస్టు చేసి విచారించగా నేరం అంగీకరించారు. వీరిపై కేసు నమోదు చేసి వైద్య పరీక్షల అనంతరం కోర్టుకు తరలిస్తామని ఐఐసీ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం




ప్రమాదంలో మృతి చెందిన యువకులు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం పాలైన ఘటన జిల్లాలోని రామనగుడ సమితి గొసాయిగులుముండ పంచాయతీలోని పొలుపాయి గ్రామ మలుపులో సోమవారం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను రామనగుడ పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఇద్దరు యువకులు బైక్‌పై రేఖాగుడ గ్రామం నుంచి రాయగడ సమితి గుమ్మ గ్రామానికి తమ బంధువుల ఇంటికి వెళుతున్న సమయంలో పొలుపాయి మలుపులో ఎదురుగా వస్తున్న ట్యాంకర్‌ను అదుపు తప్పి ఢీకొనడంతో పక్కనే గల లోయలోకి పడిపోయారు. దీంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల వివరాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన పవన్‌కుమార్

చీపురుపల్లి రూరల్ (గరివిడి): బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్ల మండలం చింతపల్లిపేట గ్రామానికి చెందిన చింతపల్లి పవన్‌కుమార్ (22) మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుని సోదరుడు చింతపల్లి జనార్దన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు పవన్‌కుమార్, తన స్నేహితుడు కనిమెరక శ్రీను ఇద్దరూ కలిసి అదే గ్రామానికి చెందిన రాజేష్ అనే వ్యక్తిని బైక్‌పై చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో దింపడానికి సోమవారం ఉదయం వెళ్లారు. అనంతరం అదే బైక్‌పై పవన్‌కుమార్, శ్రీను ఇద్దరూ కలిసి గ్రామానికి వస్తున్నారు. సరిగ్గా గరివిడి పట్టణంలోని టీచర్స్ కాలనీ వద్దనున్న నీళ్ల ట్యాంకు వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న పవన్‌కు తీవ్ర గాయాలు కాగా.. బండి నడుపుతున్న శ్రీనుకు స్వల్పగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య


పర్వీన్ మృతదేహం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి డోలపేట గ్రామంలో నివాసం ఉంటున్న ఓ వివాహిత సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనకు సంబంధించి టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బీహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లా రసూల్ గంజ్ గ్రామానికి చెందిన మీన్ పర్వీన్ (24), మహ్మద్ జఫీన్ దంపతులు కొన్నేళ్లుగా రాజాం పట్టణ పరిధి డోలపేటలో నివాసం ఉంటున్నారు. మహ్మద్ మార్బుల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులున్నారు. మీన్ పర్వీన్ తరచూ కడుపునొప్పితో బాధపడేది. ఈ క్రమంలో సోమవారం కూడా కడుపునొప్పి రావడంతో భర్త పనికి వెళ్లిపోయిన తర్వాత పర్వీన్ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన మహ్మద్ ఫ్యాన్‌కు వేలాడుతున్న భార్యను చూసి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీ కొని యువకుడి మృతి


రక్తపు మడుగులో ఉన్న నాగభూషణ్

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని పెదకుదమ గ్రామానికి చెందిన వారాడ నాగభూషణరావు (43) తన బైక్‌పై సోమవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో చినకుదమ వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా.. గౌరీపురం, కుదమ కూడలి సమీపాన గల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీ కొట్టింది. దీంతో నాగభూషణరావు తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వగా.. సిబ్బంది వచ్చి క్షతగాత్రుడ్ని పార్వతీపురం ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి తల్లి లక్ష్మమ్మ, భార్య గంగ, పిల్లలు కుమార్, సునీతతో పాటు తమ్ముడు, చెల్లి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చినమేరంగి ఎస్సై పి. అనీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెక్ బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

గజపతినగరం: మండల కేంద్రానికి చెందిన ఇప్పనగిరి శ్రీను అనే వ్యక్తి పురిటిపెంట గ్రామానికి చెందిన కంది వెంకటరమణకు ఐదు లక్షల రూపాయలు అప్పుగా ఇచ్చాడు. ఇందుకు గాను వెంకటరమణ ఇచ్చిన చెక్ బౌన్స్ కావడంతో శ్రీను కోర్టునాశ్రయించాడు. దీంతో వాదోపవాదనలు విన్న తర్వాత స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జ్ ఎ. విజయ్‌రాజ్‌కుమార్ నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు. శిక్షతో పాటు బాధిత వ్యక్తి రూ. 7.45 లక్షలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వానికి రూ. 5 వేలు అపరాధ రుసుం చెల్లించాలని ఆదేశించారు.

భూమికి పచ్చని రంగేసినట్టు

సంతకవిటి మండలంలోని సిరిపురం తామర చెరువు ఆయకట్టు కింద వరి పంట ఆశాజనకంగా ఉంది. కనుచూపు మేరలో ఎటువైపు చూసినా భూమికి పచ్చని రంగేసినట్టుగా పైరు అందంగా కనిపిస్తోంది. సంతకవిటి–పొందూరు మార్గాన ప్రయాణించేవారికి ఈ వరి చేను ఆహ్లాదాన్ని పంచుతోంది.

– సంతకవిటి



జిల్లాలో అభివృద్ధి శూన్యం..


నిలిచిపోయిన తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్ట్

- పూర్తికాని ప్రాజెక్టులు
- కానరాని అభివృద్ధి పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

విజయనగరం గంటస్తంభం: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక జిల్లాలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఎన్నో హామీలిచ్చినా నేటికీ ఏ ఒక్క హామీ కూడా పూర్తి చేసిన దాఖలాలు లేవు. సాగునీటి ప్రాజెక్టుల ఊసే ఎత్తకపోవడంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాకు రెండుసార్లు వచ్చినా హామీలు ఇవ్వడమే తప్ప ఆచరణలో చేసి చూపించలేకపోయారు.

జైకా నిధులపై నిర్లక్ష్యం...

2014 సంవత్సరం నుంచి జైకా నిధులపైనా నిర్లక్ష్యం కొనసాగుతోంది. వట్టిగెడ్డకు రూ.38 కోట్ల జైకా నిధులు విడుదలయ్యాయి. కానీ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. దీంతో కోట్ల రూపాయల విలువైన పనులు చేసిన తర్వాత కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. వెంగళరాయ సాగర్‌కు రూ.64 కోట్లతో టెండర్లు ఆమోదించారు. ఈ పనులు కూడా మధ్యలో నిలిచిపోయాయి. అలాగే పెదంకలాం, ఆంధ్ర ప్రాజెక్ట్ పనులు కూడా పూర్తయ్యే దాఖలాలు కనిపించడం లేదు.

మూతబడిన ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ..

చెరకు రైతులకు అండగా నిలబడడంతో పాటు వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించిన ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ మూతబడింది. ముడి సరుకు కొరత, విద్యుత్ చార్జీల పెరుగుదల, ప్రభుత్వ రాయితీలు కల్పించకపోవడం వంటి కారణాలతో ఫ్యాక్టరీని మూసి వేయాల్సి వచ్చింది.


మూతపడిన ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీ

శిథిలావస్థలో నారాయణపురం ఆనకట్ట ..

సంతకవిటి మండలం రంగారాయపురం, శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం నారాయణపురం సమీపంలో నాగావళి నదిపై 1959 – 63 మధ్య నారాయణపురం ఆనకట్టను నిర్మించారు. సంతకవిటితో పాటు శ్రీకాకుళం జిల్లాలోని సుమారు 38 వేల ఎకరాలకు ఈ ఆనకట్ట సాగునీరు అందిస్తూ వచ్చింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తి నిర్లక్ష్యం కనబరచడంతో షట్టర్లు, రెగ్యులేటర్లు, స్పిల్‌వే వ్యవస్థలతో పాటు కాలువలు, గట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి.

ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి ..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదిహేను నెలలు దాటినా జిల్లాలో అభివృద్ధి రూపురేఖలు కనిపించడం లేదు. గిరిజన విశ్వవిద్యాలయం, భోగాపురం విమానాశ్రయం వంటి ప్రధాన ప్రాజెక్టులు నిలిచిపోయాయి. పతంజలి వంటి సంస్థల పరిశ్రమలు కూడా ఊసులకే పరిమితమయ్యాయి. అంతేకాదు, పదిహేను సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను తొలగించడం, మౌలిక సదుపాయాల కేటాయింపులో జాప్యం వంటి చర్యలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

దయనీయంగా తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్..

తారకరామ తీర్థ సాగర్ ప్రాజెక్ట్ పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వాలు ఎన్ని మారినా దాని తలరాత మాత్రం మారలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకపోవడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు రూ. 18 కోట్ల వరకు బకాయిలు ఉండడంతో వారు పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఈ ప్రాజెక్ట్‌కు రూ.730 కోట్ల పనులకు పాలనా ఆమోదం లభించగా..ఇంతవరకు రూ. 310 కోట్ల రూపాయల పనులు మాత్రమే జరిగాయి. మరోవైపు 300 ఎకరాల వరకు భూసేకరణ చేయాల్సి ఉన్నా దాని జోలికి మాత్రం పోలేదు.

తెర్లాం ఉపాధ్యాయుడికి గుర్తింపు

- వరించిన అంతర్జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు


అవార్డు అందుకుంటున్న తెర్లాం హైస్కూల్ స్పెషల్ టీచర్ సునీల్

తెర్లాం: అంతర్జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పత్తికాయల సునీల్ ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విజయవాడలో సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ (సోలిట్) ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇండియా – అమెరికా సంయుక్త రాష్ట్రాలు విద్యా, సాంకేతికతలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను గుర్తించి వారికి అంతర్జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాదికి సంబంధించి తెర్లాం హైస్కూల్‌లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు బోధిస్తున్న సునీల్‌కు అవార్డు వరించింది.ఈ నేపథ్యంలో ఏపీ స్టేట్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కరరావు, అనువాద ఏఐ సీఈఓ డాక్టర్ బి.చంద్రశేఖర్, ప్రముఖ అంతర్జాతీయ క్యాన్సర్ రీసెర్చ్ నిపుణుడు డాక్టర్ జి.పూర్ణచంద్ర నాగరాజు, యూనివర్సిటీ ఆఫ్ అలబామా ఎట్ బర్మింగ్‌హామ్ (అమెరికా) చేతుల మీదుగా సునీల్ అవార్డు అందుకున్నారు. దేశ వ్యాప్తంగా 80కి అవార్డులు రాగా.. అందులో ఒకరు జిల్లా వాసి కావడం గర్వకారణమని ఎంఈఓ త్రినాథరావు, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, తదితరులు ప్రశంసించారు.

నేషనల్ యూనివర్సిటీ గేమ్స్‌కు లావణ్య


లావణ్య

చీపురుపల్లి: సౌత్ జోన్ నేషనల్ యూనివర్సిటీ కబడ్డీ పోటీలకు పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం (బీకాం) చదువుతున్న డి.లావణ్య ఎంపికైంది. ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన ఏయూ ఇంటర్ కాలేజ్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల జట్టు ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అయితే ఈ పోటీల్లో అద్భుతంగా రాణించిన లావణ్యను సౌత్ జోన్ నేషనల్ యూనివర్సిటీ గేమ్స్‌కు ఎంపిక చేశారు. దీంతో లావణ్యను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.జ్వాలాముఖి, సిబ్బంది అభినందించారు.

గడువులోగా రీ సర్వే పూర్తి చేస్తాం..

- జిల్లా సర్వే అండ్ సెటిల్మెంట్ ఎ.డి లక్ష్మణరావు


మాట్లాడుతున్న సర్వే అండ్ సెటిల్మెంట్ రికార్డ్స్ జిల్లా ఎ.డి లక్ష్మణరావు

సీతానగరం: జిల్లాలో జరుగుతున్న థర్డ్ ఫేజ్ రీ సర్వే పనులు 30 రోజుల్లో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకున్నామని సర్వే అండ్ సెటిల్మెంట్ రికార్డ్స్ ఏడీ పి. లక్ష్మణరావు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే అండ్ సెటిల్మెంట్ డైరెక్టరేట్ కార్యాలయం డీడీ, మూడు జిల్లాల ప్రత్యేక అధికారి కె. సూర్యనారాయణతో సమావేశమై రీ సర్వేపై చర్చించారు. ఈ సందర్భంగా ఎ.డి లక్ష్మణరావు మాట్లాడుతూ.. థర్డ్ ఫేజ్ కింద 43 గ్రామాలకు గాను 27,380 ఎకరాల్లో రీ సర్వే చేయాలని నిర్ధారించామని, అందులో ప్రైవేట్ భూమి 18,788 ఎకరాలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ కె. సూర్యనారాయణ మాట్లాడుతూ.. రీ సర్వే ప్రక్రియ నిర్దేశిత సమయానికి పూర్తి చేసేలా అధికారులకు అవగాహన కల్పించామన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాల్లో సర్వే పనులపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నామని, ఇందులో భాగంగానే ఇప్పలవలసలో చేపడుతున్న సర్వేను పరిశీలించామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి శ్రీనివాసరావు, మండల సర్వేయర్ చంద్రశేఖర్, స్థానిక సర్వేయర్లు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు ఇంటర్వ్యూలు


అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న సూపరింటెండెంట్ నారాయణరావు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. పది పోస్టులకు గాను 250 మంది హాజరుకాగా..ఆస్పత్రి ఆఫీస్ సూపరింటెండెంట్ నారాయణరావు, ఇతర సిబ్బంది ఇంటర్వ్యూలు చేపట్టారు.

సమస్యల పరిష్కారంలో పారదర్శకత

- కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డి


అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డితో పాటు డీఆర్‌ఓ, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు

విజయనగరం అర్బన్: సమస్యల పరిష్కారంలో అధికారులు పారదర్శకత పాటించాలని కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పీజీఆర్‌ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు మండల, మున్సిపల్ స్థాయి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లేదా జూమ్ లింక్ ద్వారా తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఫిర్యాదుల రీ ఓపెనింగ్ ఎక్కువగా ఉంటున్నాయని, రెండు వారాల్లో వాటిని తగ్గించాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుదారుడికీ సక్రమమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వడం, అందులో సంబంధిత రూల్ పొజిషన్ స్పష్టంగా పేర్కొనడం తప్పనిసరన్నారు. ఎండార్స్‌మెంట్లు నిర్లక్ష్యంగా ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిరోజూ కనీసం 60 కాల్స్ చేసి ఫిర్యాదుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు.

ఫిర్యాదుల స్వీకరణలో కొత్త విధానం..

పీజీఆర్‌ఎస్ వినతుల స్వీకరణలో కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఫిర్యాదులు అధికంగా వస్తున్న విద్యాశాఖ, డీఆర్‌డీఏ, వైద్యారోగ్య శాఖకు చెందిన బాధ్యతలను కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓలతో పాటు ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లు తీసుకున్నారు. ప్రవేశ ద్వారంలోనే వినతులకు సంబంధించిన ప్రభుత్వ శాఖను తెలుసుకుని.. ఆ అధికారి వద్దకు నేరుగా అర్జీదారులను పంపే విధానాన్ని సోమవారం నుంచి అమలులోకి తెచ్చారు.

పీజీఆర్‌ఎస్‌కు 184 వినతులు..

పీజీఆర్‌ఎస్‌కు జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారుల నుంచి 184 ఫిర్యాదులు స్వీకరించారు. అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులు 69 వచ్చాయి. డీఆర్‌డీఏకి చెందినవి 28, డీపీఓకు సంబంధించినవి 13, మున్సిపాలిటీలకు సంబంధించి మరో 13, జీఎస్‌డీడబ్ల్యూస్‌కు 21, ఇతర శాఖలతో కలిపి 184 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఎస్.శ్రీనివాసమూర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు మురళీ, వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీలాగాంధీ, రాజేశ్వరి, కళావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సత్వరమే పరిష్కరించాలి..

- కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి

పార్వతీపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన సమస్యలను సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకరరెడ్డి జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన అర్జీదారులు తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో తిరిగి వెళ్లాలన్నారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 112 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరాల సేవలు, గృహాల మంజూరు, పింఛన్లు, సర్వే, ఉపాధి, తదితర సమస్యలకు సంబంధించిన వినతులు ఎక్కువగా వచ్చాయి. కార్యక్రమంలో సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్‌ఓ హేమలత, ఉప కలెక్టర్లు ధర్మచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

40 ఫిర్యాదుల స్వీకరణ..



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్, ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు 40 వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఎస్పీ ఏఆర్ దామోదర్ శ్రద్ధగా విని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ తగాదాలకు సంబంధించి 8, కుటుంబ కలహాలవి 5, మోసాలవి 4, నగదు వ్యవహారాలకు సంబంధించినవి ఒకటి, ఇతర అంశాలకు సంబంధించినవి 22 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సీఐ ఏవీ లీలారావు, డీసీఆర్‌బీ సీఐ బి.సుధాకర్, ఎస్సై ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటిన జిల్లా స్విమ్మర్స్


మెడల్స్ సాధించిన జిల్లా పారా క్రీడాకారులు

విజయనగరం: పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏలూరు వేదికగా నిర్వహించిన 7వ రాష్ట్ర పారా స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో జిల్లాకు చెందిన పారా స్విమ్మర్స్ ప్రతిభ కనబరిచారని అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు కె. దయానంద్ తెలిపారు. ఏలూరులోని బిశ్వనాథ్ ఈత కొలనులో నిర్వహించిన ఈ పోటీల్లో సీనియర్ మెన్ కేటగిరీలో జాగరణ సత్యనారాయణ 50 మీటర్ల బెస్ట్ స్ట్రోక్ పోటీల్లో సిల్వర్ మెడల్.. 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో సిల్వర్ మెడల్ దక్కించుకున్నాడని తెలిపారు. సబ్ జూనియర్ ఉమెన్ విభాగంలో ప్రియాంకదాస్ బెస్ట్ స్ట్రోక్‌లో.. మౌనిక 50 మీటర్ల ఫ్రీ స్టైల్ పోటీల్లో సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈ మేరకు విజేతలను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామిలతో కలిసి సోమవారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

జీతాలందక అవస్థలు


కలెక్టర్ రామసుందర్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్రలు

- కలెక్టర్ రామసుందర్ రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఆరోగ్యమిత్రలు

విజయనగరం ఫోర్ట్: ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) పథకంలో పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలకు ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి జీతాలు ఇప్పించాలని పలువురు కోరారు. ఈ మేరకు కలెక్టర్ రామసుందర్ రెడ్డిని సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యమిత్రల సంఘ జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రదీప్ మాట్లాడుతూ.. రెండు నెలలుగా జీతాలు అందకపోవడంతో సిబ్బంది కుటుంబాలను నెట్టుకురాలేకపోతున్నారన్నారు. వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో పైడపునాయుడు, మహేష్, బంగారునాయుడు, జగదీష్, రాజప్పడు, తదితరులు పాల్గొన్నారు.

యజమానే మా కొడుకును చంపేశాడు..


మాట్లాడుతున్న మృతుడు రాము తల్లిదండ్రులు

- మృతుడు యలకల రాము తల్లిదండ్రులు

చీపురుపల్లి: తండ్రిలా చూసుకోవాల్సిన యజమానే తమ కొడుకును కిరాతకంగా హత్య చేసాడని మండలంలోని పత్తికాయవలస గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన యలకల రాము తల్లిదండ్రులు సింహాచలం, రమేష్ ఆరోపించారు. తమ కుమారుడిని యజమానే హత్య చేసాడని ఆలస్యంగా తెలుసుకున్న వారు సోమవారం ఫిర్యాదు చేసేందుకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా మృతుని తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ కుమారుడు నాలుగు సంవత్సరాలుగా తమ గ్రామానికి చెందిన వండాన సన్యాసి వద్ద జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడని చెప్పారు. అయితే సకాలంలో జీతాలు కూడా ఇచ్చేవాడు కాదని.. అయినప్పటికీ ఒకే ఊరు కావడంతో ఆయన వద్దనే పని చేస్తుండేవాడని తెలిపారు. ఈ నెల 8న ఇంటి నుంచి విధులకు వెళ్లిన తమ కొడుకు రాము తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. ఫోన్ చేసినా అవ్వకపోవడంతో యజమాని సన్యాసికి ఫోన్ చేసి చెప్పగా.. అప్పటికే విధులు ముగించుకుని వెళ్లిపోయాడని తెలిపాడని చెప్పారు. మరుచటి రోజు యజమాని సన్యాసి గ్రామంలో వేరేవారికి ఫోన్ చేసి రాము అలిగి వెళ్లిపోయాడని.. పదో తేదీన మరి కొంతమందితో భోగాపురం విమానాశ్రయం పనికి వెళ్లిపోయాడని పొంతన లేని సమాధానాలు చెప్పాడన్నారు. ఇంతలో 11వ తేదీన పుల్లేయవలస ఇటుక బట్టీల వద్ద ఉన్న బావిలో తమ కుమారుడు శవమై కనిపించాడని కన్నీరుమున్నీరయ్యారు. తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతోనే సన్యాసి తమ కుమారుడ్ని హత్య చేశాడని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడ్ని శిక్షించాలని కోరారు.

ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు అవార్డు

- గుజరాత్‌లో మంత్రి చేతుల మీదుగా అందుకున్న సుమతి


రైల్వే మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కిమిడి సుమతి

వంగర: మండల పరిధి తలగాం గ్రామానికి చెందిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ కిమిడి సుమతికి ధైర్య సాహస అవార్డు దక్కింది. ఐదేళ్ల కిందట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్సులో కానిస్టేబుల్‌గా వెస్ట్ బెంగాల్‌లోని మెచేడా రైల్వేస్టేషన్‌లో విధులు నిర్వహించే సమయంలో.. ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడుతుండగా ఆ వ్యక్తిని రక్షించింది. అలాగే రైల్వే ఆస్తులు, ప్రయాణికుల భద్రత పట్ల ఆమె చూపించిన ధైర్య సాహసాలను సంబంధిత శాఖ గుర్తించింది. ఈ మేరకు గుజరాత్‌లోని వలాస్డ్ ఆర్పీఎఫ్ శిక్షణ కేంద్రంలో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ చేతులమీదుగా సుమతి సోమవారం అవార్డు అందుకుంది. ఈ మేరకు సుమతిని పలువురు అభినందించారు.

విద్యార్థుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలి

కురుపాం: గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతూ అనారోగ్యం బారిన పడి మృతి చెందిన విద్యార్థులు అంజలి, కల్పన కుటుంబాలకు ప్రభుత్వం రూ.50లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.అశోక్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అఖిల్, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఈ సంఘాల ఆధ్వర్యంలో కురుపాం గురుకుల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాల నేతృత్వంలో రావాడ జంక్షన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజనుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనికి ప్రత్యక్ష సాక్ష్యమే గురుకుల పాఠశాల పరిస్థితి అన్నారు. మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యానికి కారణమైన గిరిజన సంక్షేమాధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లాలో ఉన్న అన్ని గిరిజన సంక్షేమాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం హెచ్‌డీటీ సురేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఘనంగా గౌర్రిపాటి జయంతి


జామిలో జి.బి.అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

జామి: మండల కేంద్రంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తాటిపూడి జలాశయ సాధకుడు గౌర్రిపాటి బుచ్చి అప్పారావు జయంతిని వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బజార్ సెంటర్‌లో ఉన్న జీబీ అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. గౌర్రిపాటి బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఇంటలెక్చువల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చలుమూరి సత్యారావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, పార్టీ ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు అప్పాన సుబ్రహ్మణ్యం, జన్నివలస సర్పంచ్ శీరెడ్డి చందునాయుడు, అలమండ ఉప సర్పంచ్ లగుడు దేముడు, మండల ప్రచార కార్యదర్శి చుక్క సూరిదేముడు, న్యాయవాది బూసర్ల రమణారావు, నేతలు బసవరాజు, రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.